## క్లుప్తంగా

### ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

బోనకల్: కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో ఆసంఘం జిల్లా అధ్యక్షుడు గారె లక్ష్మీనారాయణతో కలసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణా వచ్చిన తరువాత కాంట్రాక్ట్ అనే పదమే ఉండదని చెప్పిన కేసీఆర్ ఆ మాటను మరిచారన్నారు. ఏఎస్ఎంలు, కాంట్రాక్ట్ అధ్యాపకులు, వీఆర్ఏలు, జూనియర్ పంచాయతీ కార్యదర్శులను వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు.

### ఎన్నో మార్పులకు శ్రీకారం మన్‌కీ బాత్

పెనుబల్లి : సామాన్యులతో అనుసందానానికి మన్‌కి బాత్ వేదిక అయ్యిందని బీజేపీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వర రావు అన్నారు. ఆదివారం పెనుబల్లిలో ఆ పార్టీ మండల అధ్యక్షులు బొర్రా నరసింహారావు ఆధ్వర్యంలో.. 'మన్‌కీ బాత్'ను స్థానిక రైతులు, కూలీలతో కలిసి ప్రత్యక్ష ప్రచారం ద్వారా స్క్రీన్ మీద వీక్షించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ భాస్కర్ల వీరం రాజు, మండల నాయకులు శ్రీనివాసాచారి, మైనార్టీ మోర్చా అధ్యక్షులు ఈసూబ్, ఎస్సీ మోర్చా అధ్యక్షులు పేర్ల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

### ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఎర్రుపాలెం: మండలంలోని తక్కెళ్ళపాడు గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో ఆదివారం డీసీసీబీ డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వరరెడ్డి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కూరపాటి సుందరమ్మ, ఎంపీటీసీ కూరపాటి యశోద, ఉప సర్పంచ్ అయిలూరి నాగిరెడ్డి,సొసైటీ సీఈవో కృష్ణ, డైరెక్టర్‌లు, సిబ్బంది,రైతులు పాల్గొన్నారు.

### రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి

కల్లూరు రూరల్: రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించాలని జిల్లా రేషన్ డీలర్ల అసోసియేషన్ ఉపాధ్యక్షులు సింగిసాల ప్రసాద్ అన్నారు. ఆదివారం కల్లూరు మండల కార్యాలయం ఎదుట డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేషన్ డీలర్ల జేఏసీ ఆధ్వర్యంలో ఖమ్మంలోని పెద్దతండాలో సోమవారం నిర్వహించే సభకు డీలర్లందరూ అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు.

### కమాండెంట్ త్రినాద్‌కు అభినందన



కమాండెంట్ త్రినాద్‌ను సన్మానిస్తున్న జమలాపురం భవానిశంకర్, స్నేహితులు

సత్తుపల్లి: సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసుకున్న నరుకుళ్ల త్రినాద్ అంచలంచెలుగా కమాండెంట్‌గా పదోన్నతి లభించటంతో ఈ ప్రాంత పూర్వ విద్యార్థులు ఆదివారం ఆయనకు అభినందనలు తెలిపారు. జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సరస్వతి విగ్రహానికి పూలమాలలు వేసి పట్టణంలో భారీ ప్రదర్శనగా ఆయన స్వగ్రామమైన దమ్మపేట మండలం నాచారంలో జరిగే పౌరసన్మాన సభకు తరలి వెళ్లారు. కార్యక్రమంలో గవర్నర్ కార్యాలయం ప్రత్యేకాధికారి జమలాపురం భవానీ శంకర్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

### మేడేను విజయవంతం చేయండి

సత్తుపల్లిరూరల్: ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను సోమవారం కార్మికులందరు పాల్గొని విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దండు ఆదినారాయణ పిలుపునిచ్చారు. ఆదివారం సత్తుపల్లిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను హరించేలా చట్టాలు చేస్తుందని కార్మికులందరు ఐక్యంగా పోరాడాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు టి.యోబు, రామకృష్ణ పాల్గొన్నారు.

### ఆర్థిక సాయం

కారేపల్లి: గుండెపోటుతో మృతి చెందిన మిత్రుడి కుటుంబానికి.. చిన్ననాటి స్నేహితులు ఆర్థిక సాయం అందించారు. మండలంలోని గోవింద్‌తండా గ్రామానికి చెందిన ఫొటోగ్రాఫర్ బర్మావత్ నాగేశ్వరరావు (36) ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. ఈ క్రమంలో మృతుడి స్నేహితులు రూ.13,500 లు ఆర్థిక సాయం అందించారు. అనంతరం ఫొటోగ్రాఫర్లు రూ.10 వేలు అందించి ఫొటో గ్రాఫర్ల యూనియన్ నుంచి రూ.లక్ష కుటుంబ భరోసా కింద త్వరలోనే మంజూరు చేయిస్తామన్నారు. సాయమందించిన వారిలో మిత్ర బృందం కోటి, ఉపేందర్, వీరు, జైత్రాం, వీరన్న, ఫొటోగ్రాఫర్ల సంఘం నాయకులు రాధాకృష్ణ, రియాజ్, సైదిరెడ్డి, పిచ్చయ్య, భగవాన్, వెంకన్న, కన్ని, కృష్ణ పాల్గొన్నారు.

# ఎన్నెస్పీ కాల్వలు అధ్వానం

- గుర్రపు డెక్క, పిచ్చి మొక్కలతో మేజర్, మైనర్ కాల్వలు
- కనీస మరమ్మతులకు కూడా నోచని వైనం
- ముందుకు కదలని సాగునీరు
- ఇకనైనా బాగు చేయాలని రైతుల వేడుకోలు



సిరిపురం మేజర్ కాల్వపై పెరిగిన గుర్రపు డెక్క



మేజర్ కాల్వలో పేరుకు పోయిన చెత్త చెదారం

తల్లాడ: నాలుగు దశాబ్దాలు పూర్తి చేసుకున్న నాగార్జున సాగర్ కాల్వలు(ఎన్నెస్పీ) ఎనిమిదేళ్లుగా మరమ్మతులకు నోచుకోక ఆధ్వానంగా తయారైంది. ఈ కాలువల్లో గుర్రపు డెక్క, చెత్త చెదారంతో పాటు పిచ్చి చెట్లు అల్లుకుపోవడంతో సాగునీరు సరఫరాకు ఆటంకం కలుగుతుంది. దీంతో చివరి ఆయకట్టు రైతులకు పూర్తి స్థాయిలో నీరందడం లేదు.

**ఎన్నెస్పీపై ఆధారపడిన తల్లాడ మండలం..**

ఎన్నెస్పీ కాల్వలపైనే తల్లాడ మండలం ఆధారపడి ఉంది. 1977లో ఈ ఎన్నెస్పీ కాల్వలను నిర్మించారు. వీటిపై తల్లాడలోని సిరిపురం, రామచంద్రాపురం, గూడూరు 1, 2, పుణ్యపురం, బస్వాపురం మేజర్లు ఉన్నాయి. వీటి కింద పలు మైనర్లు, సబ్ మైనర్లు ఉన్నాయి. ఈ ఏడాది వర్షాలు సకాలంలో కురవడంతో ఖరీఫ్ సీజన్‌లో వరి పంటకు నీటిని విడుదల చేశారు. ఖరీఫ్‌లో వరి 21 వేల ఎకరాల్లో పండింది. రబీ సీజన్‌లో కూడా వరి పంట 17 వేల ఎకరాల్లో సాగు చేశారు.

**ముందుకు కదలని సాగునీరు..**

సాగర్ కాల్వల్లో విపరీతంగా గుర్రపు డెక్క, రెండు పక్కల పిచ్చి చెట్లు మొలిచాయి. దీంతో సాగునీరు ముందుకు కదలక పోవడంతో పంటలకు నీరు అందడం లేదు. ఎగువ భూములకు మాత్రమే నీరు అందుతుంది. దిగువ (చివరి) భూములకు నీరు అందడం లేదు. దీంతో రైతులు నీటి కోసం రేయింబవళ్లు కాల్వల చుట్టూ తిరగాల్సి వస్తోంది.

**పట్టించుకోని ఎన్నెస్పీ సిబ్బంది..**

ఎన్నెస్పీ సిబ్బంది మాత్రం తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. మరమ్మతులు కూడా నామ మాత్రంగానే చేస్తుండడంతో చివరి ఆయకట్టు రైతులకు నీరు చేరడం లేదు. కానీ వాటిని తొలగించకపోవడంతో నీటి సరఫరాకు ఆటంకం కలుగుతుంది. ఇలా ఉంటే ఖరీఫ్ సీజన్‌లో చివరి పంటలకు నీరందటం కష్టమేనని రైతులు వాపోతున్నారు. కనీసం ఇకనైనా ఎన్నెస్పీ అధికారులు, సిబ్బంది కాల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి మరమ్మతులు చేయించాలని పలువురు రైతులు కోరుతున్నారు.

**ఎనిమిదేళ్లుగా ఇదే పరిస్థితి..**

గత ఎనిమిదేళ్లుగా ఈ కాల్వలు మరమ్మతులకు నోచుకోలేదు. ప్రతీ ఏటా ఖరీఫ్‌కు ముందే కాల్వలను శుభ్రపరచాలి. నిధులు లేక మరమ్మతులు జరగలేదు. దీంతో 150 క్యూసెక్కులు నీటిని సరఫరా చేయాల్సిన మేజర్లలో 100 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో ప్రతీ ఏటా రైతులు నీటి కోసం కాల్వల చుట్టూ తిరుగాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ వేసవిలో లస్కర్లు కాలువలో ఉన్నటువంటి పిచ్చి మొక్కలు తొలగించాల్సి ఉంది. వర్షాలు పడితే కాల్వలను మరమ్మతులు చేయడానికి వీలు పడదు.

**కాల్వలను పర్యవేక్షించాలి..**



మేజర్ కాల్వల్లో ముఖ్యంగా గుర్రపు డెక్క, కంప చెట్లు దట్టంగా పెరిగాయి. వీటితో పాటు నాచు కూడా అల్లుకు పోయింది. పూడిక పేరుకు పోయింది. వీటి వల్ల కాల్వల్లో నీటి సరఫరా సరిగా జరగడం లేదు. వెంటనే వీటిని తొలగించాలి. ఉన్నతాధికారులు కాల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తే నీటి సమస్యలు తొలగిపోతాయి.

– కిన్నెర కృష్ణయ్య, రైతు, రామానుజవరం

**మరమ్మతులు చేయాలి ..**



ప్రతి ఏటా ఎన్నెస్పీ కాలువల ద్వారా చివరి భూములకు నీరందటం లేదు. సీజన్ ముగియగానే కాల్వలను బాగు చేయాలి. కానీ అలా చేయటం లేదు. దీంతో కాల్వల్లో చెత్త చెదారం పేరుకు పోతుంది. కాల్వల్లోపై నుంచే వచ్చే వ్యర్థాలు కూడా కిందకు వచ్చి ఆగిపోతున్నాయి. ఈ ఏడాది కాల్వలకు మరమ్మతులు చేయాలి.

– పరుచూరి సతీష్, రైతు, మంగాపురం

## యువత మత్తుకు బానిస కావొద్దు..



గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ముదిగొండ: మత్తు పదార్థాలకు, మద్యపానానికి యువత బానిస కావొద్దని ఖమ్మం ట్రాఫిక్ సీఐ అంజలీ అన్నారు. ముదిగొండ మండలం బాణాపురంలో ఆదివారం మత్తు పదార్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రమ, రిటైర్డ్ ఐఆర్ఎస్ భాస్కర్‌రెడ్డి, సీతారామయ్య, వెంకటేశ్వర్లు, రామారావు, ధర్మా, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

### రిటైర్డ్ హెచ్‌ఎం మృతికి సంతాపం



వెంకటేశ్వరరెడ్డి (ఫైల్)

మధిర: మాటూరు పేట గ్రామానికి చెందిన రిటైర్డ్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శీలం వెంకటేశ్వరరెడ్డి (69) అనారోగ్యంతో బాధపడుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందాడు. ఆయన కొంతకాలంగా మధిరలో నివసిస్తున్నారు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుమార్తె డాక్టర్ ఇందిర ప్రస్తుతం మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్నారు. కుమారుడు ఉద్యోగరీత్యా అమెరికాలో స్థిరపడ్డారు. వెంకటేశ్వరరెడ్డి మృతదేహాన్ని మధిర మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ శీలం విద్యాలత, భరత్ విద్యాసంస్థల అధినేత శీలం వెంకటరెడ్డి, ఎంఈఓ ప్రభాకర్, ఎస్‌టీఎఫ్ జిల్లా నాయకులు కోటారెడ్డి తదితరులు సందర్శించి నివాళి అర్పించారు.

### బాధిత కుటుంబానికి సంభాని పరామర్శ

కల్లూరు: కల్లూరు మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు ఎస్‌కే కమ్లి తల్లి జాన్‌బీ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందింది. సమాచారం అందుకున్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ ఆ గృహాన్ని సందర్శించి మృత దేహం వద్ద నివాళులు అర్పించారు. అదే విధంగా ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కమ్లి కుటుంబాన్ని ఫోన్‌లో పరామర్శించి సంతాపం తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో ఎంపీపీ రఘు, జెడ్పీటీసీ అజయ్‌కుమార్, నాయకులు సయ్యద్ అలీ, పాలెపు రామారావు, లక్కినేని రఘు, జిల్లా కమిటీ సభ్యులు పసుమర్తి చందర్‌రావు, సొసైటీ చైర్మన్ లక్ష్మణరావు, ఎండీ ఇస్మాయిల్, కాటమనేని వెంకటేశ్వరరావు, నాయకులు తదితరులు ఉన్నారు.

**మురళీకృష్ణకు సంభాని నివాళి..**

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెం గ్రామానికి చెందిన సుంకర మురళీకృష్ణ రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఆదివారం అన్నారుగూడెంలో మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. సంభాని వెంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాపా సుధాకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దగ్గుల రఘుపతిరెడ్డి, కిసాన్ సెల్ అధ్యక్షుడు ఎర్రి కృష్ణమూర్తి, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు తాళ్ల వెంకటేశ్వర్లు, బీసీ సెల్ మండల అధ్యక్షుడు రాఘవ, కాపా మహేష్ పాల్గొన్నారు.

### పిడుగుపడి గేదె, దూడ మృతి

మధిర/ఎర్రుపాలెం: మధిరలోని చిలుకూరు గ్రామానికి చెందిన ఇమ్మడి సాంబయ్యకుచెందిన గేదె మేతకు పొలానికి వెళ్లగా పిడుగుపాటుకు గురై మృతి చెందింది. దీని విలువ రూ60 వేలు ఉంటుందని బాధితుడు తెలిపారు. అలాగే ఎర్రుపాలెంలోని మీనవోలుకు చెందిన జంగం బలశౌరికి చెందిన దూడ చేలో మేతకెళ్లి వస్తుండగా దేవాలయ సమీపంలో పిడుగు పడడంతో మృతి చెందింది. దీని విలువ రూ.20 వేలు ఉంటుందని బాధితుడు వాపోయాడు.

### జేఈఈ మెయిన్స్‌లో విద్యార్థుల ప్రతిభ



సాదం రామకృష్ణ



వినయ్‌కుమార్

మధిర/కారేపల్లి: మండలంలోని మాటూరు గ్రామానికి చెందిన సాదం రామకృష్ణ, కారేపల్లిలోని విశ్వనాథపల్లి గ్రామానికి చెందిన హలావత్ వినయ్‌కుమార్ జేఈఈ మెయిన్స్‌లో ఉత్తమ ర్యాంకు సాధించాడు. సాదం రామకృష్ణ జేఈఈ మెయిన్స్ సెషన్ 2 ఫలితాల్లో 98.98శాతం పర్సంటైల్‌తో ఓబీసీ విభాగంలో 2738వ ర్యాంక్, జనరల్ విభాగంలో 12,056 ర్యాంకు సాధించి ఉత్తమ నైపుణ్యాన్ని ప్రదర్శించాడు. హలావత్ వినయ్‌కుమార్ ఎస్టీ కేటగిరిలో 84.1 శాతంతో 2401 ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా అధికారులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు వారికి అభినందనలు తెలిపారు.

### ఏన్కూరు ఎస్సైగా రవి



ఎస్సై రవి

ఏన్కూరు: ఏన్కూరు ఎస్సైగా భాదావత్ రవి నియమితులయ్యారు. ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం పదవీ భాద్యతలు స్వీకరించారు. మహబూబ్‌బాద్ జిల్లా చిన్ని గూడురులో ఎస్సైగా విధులు నిర్వహిస్తు బదిలీపై ఏన్కూరు వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న సాయికుమార్‌ను ఖమ్మం సీపీకి ఎటాచ్ చేశారు.

### శ్రమశక్తి అవార్డుకు ఎంపికైన సింగరేణి కార్మికులు

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి జేవీఆర్ ఓసీలో పని చేస్తున్న ఎలక్ట్రీషన్‌గా పని చేస్తున్న గణపనేని శ్రీనివాసరావు, టీబీజీకేఎస్ ఫిట్ సెక్రటరీగా పని చేస్తున్న జేఎస్ఆర్ మూర్తిలు ప్రతిష్టాత్మక శ్రమశక్తి అవార్డుకు ఎంపికయ్యారు. వీరు సింగరేణిలో 35 సంవత్సరాలుగా పని చేస్తున్నారు. సోమవారం హైద్రాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగే కార్యక్రమంలో ప్రభుత్వ ఈ అవార్డును అందించనున్నట్లు తెలిపారు.

### గార్లఒడ్డు ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా చందూలాల్



భూక్యా చందూలాల్

ఏన్కూరు: మండలంలోని గార్లఒడ్డు శ్రీ లక్ష్మీ నర్సింహ స్వామి దేవస్థానం అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా భూక్య చందూలాల్ నియమితులయ్యారు. ఈ మేరకు దేవస్థానం ఎండోమెంట్స్ నుంచి వచ్చిన ఉత్తర్వులు అందాయి. మే 2న గార్లఒడ్డు దేవస్థానంలో చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేయనున్నారు. కమిటీ సభ్యులుగా రామిశెట్టి శ్రీనివాసరావు, పదిమళ్ల మురళి, బత్తిని కొండలరావు, భూక్య శాంతి, రాచబంటి వీరభద్రం, నంద్యాల శ్రీను లను నియమించారు.

### రైతు గోస పట్టదా..?

పెనుబల్లి : ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల ధాన్యం కొనకుండా ప్రభుత్వం జ్యాప్యం చేస్తుందని సీపీఎం మండల కార్యదర్శి గాయం తిరుపతిరావు అన్నారు. ఆదివారం సీపీఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో రైతు సంఘం సహాయ కార్యదర్శి వెంకటేశ్వరరావు, సీపీఎం సభ్యులు సత్యం, నాగమణి, మంగమ్మ, చిలక పాల్గొన్నారు.

### 'బొర్రా'కు ఘన నివాళి

వైరా: వైరాలోని పాతబస్టాండ్ సెంటర్ మాజీ సర్పంచ్ బొర్రా వెంకటేశ్వర్లు వర్ధంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ బొర్రా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మిట్టపల్లి నాగి, దార్నా రాజశేఖర్, స్టేజీ పినపాక సర్పంచ్ పుల్లంరాజు, పణితి సైదులు, మచ్చా రామారావు, కృష్ణారావు, కన్నెగంటి హుస్సేన్, లగడపాటి బోసు, దొడ్డా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం



బోనకల్: ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

బోనకల్/తల్లాడ/సత్తుపల్లిటౌన్/చింతకాని: బోనకల్ మండలంలోని ముష్టికుంట్ల ఉన్నత పాఠశాలలో, తల్లాడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. సత్తుపల్లిలోని శ్రీబండి శోభనాచలం ప్రభుత్వ కళాశాలలోని పదో తరగతి పూర్వ విద్యార్థులు పేతుపల్లిలో, చింతకానిలోని పందిళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులు అల్లం గార్డెన్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు పలకరించుకొని అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం అప్పటి గురువులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. మధ్యాహ్నం అందరూ కలసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు చీపు గంగాధర్, ఒగ్గు శ్రీనివాసరెడ్డి, వేముల సతీష్, మహంకాళి సందీప్, వెంకటనారాయణ, కొత్తూరు ప్రసాద్, శివ, శేషుకుమార్, శ్రీరాములు, రామకృష్ణ, హరికిరణ్ పాల్గొన్నారు.

## అకాల వర్షం.. రైతుల్లో ఆందోళన



వైరారూరల్: ధాన్యం బస్తాలపై నిలిచిన వర్షపు నీరు

వైరారూరల్/పెనుబల్లి : ఆరుగాలం శ్రమించి పంటలను సాగు చేస్తున్న రైతన్నలపై ప్రకృతి కన్నెర చేస్తోంది. ఆదివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షానికి మండలాల్లోని సిరిపురం, విప్పమడక, గరికపాడు, దాచాపురం, లింగన్నపాలెంతో పాటు పలు గ్రామాల్లో కల్లల్లో నిల్వ ఉన్న ధాన్యం రాశులు, ధాన్యం బస్తాలపై రైతులు ముందస్తు చర్యల్లో భాగంగా పర్దా పట్టాలు కప్పినప్పటికీ వర్షాలపు నీరు పట్టాలపై నిలవడమే కాకుండా కాంటాలు వేసి విక్రయానికి సిద్ధంగా ఉన్న ధాన్యం బస్తాలు సైతం కొద్దిమేర తడిచాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని సక్రమంగా కొనుగోలు చేయకపోవడంతోనే ఆరిన ధాన్యం సైతం అమ్ముకోలేక పోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ఘనంగా వాసవీమాత జయంతి



ముదిగొండ: పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మధిర: మధిర పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆదివారం వాసవీ మాత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక రామాలయం నుంచి మహిళలు 108 కలశాలతో అన్ని రకాల ద్రవ్యాలతో ఊరేగింపుగా శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయానికి తరలివచ్చారు. ఆలయ అర్చకులు శ్రీనివాసుల శేషాచార్యుల వేదమంత్రోచ్చారణలతో పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. అమ్మవారిని దర్శించుకునేందుకు ఆలయ కమిటీ అధ్యక్షులు కపిలవాయి జగన్మోహన్ రావు ఆధ్వర్యంలో భక్తులకు తగిన ఏర్పాట్లు చేశారు.

**శ్రీలక్ష్మీనరసింహాస్వామి దేవస్థానంలో..**

ముదిగొండ: ముదిగొండలోని శ్రీలక్ష్మీనరసింహాస్వామి దేవస్థానంలో ముదిగొండ మండల వాసవీ క్లబ్, ఆర్యవైశ్య సభ్యులు ఆదివారం వాసవీ అమ్మవారి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుడు రొంపిచర్ల కిషోరాచార్యులు పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదములు స్వీకరించారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షుడు బూర్లె నాగేశ్వరరావు, వనితా క్లబ్ అధ్యక్షురాలు చంద్రకళ, సభ్యులు స్వాతి, బాబురావు, నరసింహారావు, అప్పారావు, అశోక్, శ్రీను, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనా మహోత్సవం



సత్తుపల్లిటౌన్: ఆలయంలో అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

కారేపల్లి/సత్తుపల్లిటౌన్: కారేపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో, సత్తుపల్లి పట్టణంలోని విరాట్‌నగర్ లోగల శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆరాధన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేక పూజలు, జీవ సమాధి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు మహా అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణుల సంఘం, ఆలయ కమిటీ చైర్మన్, కార్యదర్శులు తుమ్మోజు రామ్మూర్తి, వేములూరి కోటాచారి, కమిటీ సభ్యులు వీరభద్రాచారి, రామాచారి, భాస్కరాచారి, నాగాచారి, శ్రీనివాసాచారి, బ్రహ్మాచారి, శంకరాచారి, ప్రసాదచారి, నరసయ్యాచారి, వాసుదేవాచారి, ఆలయ నిర్వాహకుడు కోడూరు మోహనాచారి, ఏడుకొండలు, అప్పారావు, సత్యనారాయణ, గఫార్‌ఖాన్, సత్యనారాయణ, గురుబ్రహ్మాచార్యులు, రవి, నాగాచారి, ఎస్.మధుసూదనాచారి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### కట్ట మైసమ్మకు పూజలు



వేడుకలకు హాజరైన స్విమర్స్

మధిర: మధిర ట్యాంక్ బండ్‌పై వేంచేసి ఉన్న కట్ట మైసమ్మ తల్లికి ఆదివారం మధిర స్విమర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జంగా నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళా స్విమ్మర్లు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. నరసింహారెడ్డి దంపతులను శాలువా, మెమెంటోతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్విమర్స్ చల్లా సత్యనారాయణ, భూక్య హనుమ, పల్లపోతు ప్రసాదరావు, మేకల ఉపేంద్ర, సంతోష్ కుమార్, ఎన్ఎస్ఆర్, జింకల కోటేశ్వరరావు, ఉప్పెల సాంబిరెడ్డి, శాంత కుమార్, రాంబాబు, షుకూర్, మస్తాన్ రెడ్డి, ఆంజనేయులు, మూర్తి, జానీ పాల్గొన్నారు.

### శ్రీపార్థసారధిస్వామి కల్యాణం



శ్రీపార్థసారధి స్వామి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని గీతా జ్ఞానమందిరంలో 17వ అధ్యాయనోత్సవాల సందర్భంగా శ్రీరుక్మిణి సత్యభామా సమేత శ్రీపార్థసారధి స్వామి కల్యాణ మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా బాలభోగ నివేదన, చక్రస్నానం, విశేష పూజలు, అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు వెంకటేశ్వరరావు, వెంకటనర్సయ్య, పురుషోత్తం, టి.వెంకటేశ్వరరావు, లీలాకృష్ణ, భాస్కర్‌రావు, శంకర్‌రావు, గుర్నాథం, రాఘవయ్య, చారి, పుష్పా, శ్రీనివాసరావు, సుబ్బారావు పాల్గొన్నారు.

### 257 జీఓను రద్దు చేయాలి

సత్తుపల్లి: రియల్ ఎస్టేట్ రంగానికి శాపంగా మారిన 257 జీఓను ప్రభుత్వం రద్దు చేయాలని నవ్య శ్రీను, యాకూబ్‌పాషా డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక లక్ష్మీప్రసన్న ఫంక్షన్‌హాల్‌లో రియల్ ఎస్టేట్ ఏజెంట్ల సంఘం అధ్యక్షుడు ఐ.శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. విద్య, ఆరోగ్య, వివాహ అవసరాల కోసం భూమిలోని కొంత భాగాన్ని విక్రయించేందుకు వీలు లేకుండా ప్రభుత్వం ఆంక్షలు విధించటంతో సామాన్య ప్రజలతో పాటు ఈ రంగంపై ఆధారపడి జీవిస్తున్న రియల్ ఎస్టేట్ ఏజెంట్లు కూడా నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా రియల్‌ఎస్టేట్ ఏజెంట్లు, ఇన్‌వెస్టర్లను దృష్టిలో ఉంచుకొని సమస్యను పరిష్కరించకపోతే ప్రత్యక్ష ఆందోళనలు చేయాల్సి ఉంటుందన్నారు. అనంతరం ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సమావేశంలో మట్టా ప్రసాద్, మందపాటి ప్రభాకర్ రెడ్డి, ఎస్‌కే మౌలాలీ, మారబోయిన హరిబాబు, యేసయ్య, మోహన్‌రావు, బెజవాడ రాంబాబు, మురళీకృష్ణ, పురుషోత్తం, ఎస్‌కె మధార్, చక్రవర్తి, సుంకర వాసు, వేములపల్లి మధు పాల్గొన్నారు.

### పెద్దమ్మతల్లి జాతర వేడుకలు

ఏన్కూరు: మండలంలోని గంగుల నాచారంలో పెద్దమతల్లి జాతర గత రెండు రోజులుగా నిర్వహిస్తున్నారు. చివరి రోజులో భాగంగా మహిళలు బోనాలు ఎత్తుకొని మేళతాళల నడుమ గ్రామంలో ఊరేగింపుగా వెళ్లి పెద్దమ్మతల్లికి, గ్రామదేవతలకు బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### వైన్‌షాపులో చోరీ..

కారేపల్లి: వైన్‌షాపులోగుర్తుతెలియని దుండగులు రూ.3 లక్షలు అపహరించుకుపోయిన ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. కారేపల్లి అంబేద్కర్ సెంటర్లోని బాలాజీ వైన్స్‌లో నిర్వాహకులు షాపు బందుచేసే క్రమంలో నగదును బ్యాగులో పెట్టి తీసుకెళుతుండగా గుర్తు తెలియని వ్యక్తులు ఆ బ్యాగుతో పాటు సెల్‌ఫోన్‌ను అపహరించుకెళ్లారు. దీంతో షాపు నిర్వాహకుడు ప్రేమ్ కారేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## కేసులు నమోదు చేయాలి



బోనకల్: అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

బోనకల్/తల్లాడ/సత్తుపల్లిరూరల్: దళితబంధు పథకంలో అవినీతికి పాల్పడిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఎమ్మెస్పీ మధిర నియోజక వర్గ ఇన్‌చార్జీ కోట హనుమంత్‌రావు, ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు మందా అశోక్, ఎమ్మెస్పీ జిల్లా కోఆర్డినేటర్ వెంకటేశ్వరరావు, ఎమ్మార్పీఎస్ నాయకుడు కొలికపోగు వెంకటేశ్వరరావు అన్నారు. ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ ఆధ్వర్యంలో తల్లాడ, బోనకల్, సత్తుపల్లి మండల కేంద్రాల్లో మహనీయుల ముందు ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అర్హత కలిగిన ప్రతి దళిత కుటుంబానికి దళితబంధు అమలు చేయాలన్నారు. ఎమ్మెల్యేలు తీసుకున్న సొమ్మును వెంటనే దళిత లబ్ధిదారులకు అందించాలని కోరారు. మే 10 వరకు నిరశన కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిన్న సైదులు, వెంకటేశ్వర్లు, గంగారాం, వెంకటరత్నం మేడి చందర్‌రావు, తాటి ముత్తయ్య, నరేష్, మహేంద్ర సాయి, లీలా ప్రసాద్, ప్రకాశ్‌రావు, కృష్ణ, జి.శ్రీనివాసరావు, పరిగడపు లక్ష్మణ్, అర్జున్, రాఘవ్ తదితరులు పాల్గొన్నారు.